క్లుప్తంగా

గ్రూప్‌1 ర్యాంకర్‌కు సత్కారం



మల్లేశ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఆమనగల్లు: గ్రూప్ 1 ర్యాంకర్ కావటి మల్లేశ్ యాదవ్‌ను బీజేపీ మున్సిపాలిటీ మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. పట్టణంలోని గుర్రంగుట్ట కాలనీకి చెందిన మల్లేశ్.. రాష్ట్ర స్థాయిలో 187వ ర్యాంకు, మల్టీజోన్‌లో 92వ ర్యాంక్ సాధించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లయ్య, శ్రీశైలంయాదవ్, గుజ్జరి శ్రీను, లింగం, బ్రహ్మం, శ్రీనివాసచారి, పాలాది శ్రీను, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీకి సన్మానం



ఏసీపీని సన్మానిస్తున్న నాయకులు

తలకొండపల్లి: ఎల్బీనగర్ డివిజన్ ఏసీపీ కృష్ణయ్య గౌడ్‌ను శనివారం గౌడ సంఘం కల్వకుర్తి తాలూకా కన్వీనర్ అశోక్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కార్యదర్శి శరత్‌చంద్ర, గ్రామ కార్యదర్శి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిసిన నాయకులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దశరథ్‌నాయక్, నాయకులు

కడ్తాల్: సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డిలను జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో.. బీఆర్‌ఎస్ మండల నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆహ్వానం మేరకు 3న ముద్విన్, బోయిన్‌గుట్ట తండాలో పర్యటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పర్యటనతో కార్యకర్తలు, నాయకుల్లో ఉత్సాహం నింపిందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామన్నారు. ఈ సందర్భంగా సభను జయప్రదం చేసినందుకు దశరథ్‌నాయక్‌ను హరీశ్‌రావు అభినందించినట్లు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాంబల్‌నాయక్, నర్సింహగౌడ్, అంజినాయక్, ఈశ్వర్‌నాయక్, శ్రీను, ప్రశాంత్ ఉన్నారు.

దోసెలో బొద్దింక!

- మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు
- రూ.2,500 జరిమానా



హోటల్ క్యాషియర్‌కు జరిమానా రశీదును అందజేస్తున్న మున్సిపల్ అధికారి ప్రణవ్

ఇబ్రహీంపట్నం: ఓ హోటల్‌లో దోస తింటున్న వ్యక్తికి అందులో బొద్దింకను చూసి నిర్ఘాంతపోయాడు. ఈ విషయమై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఇబ్రహీంపట్నానికి చెందిన హన్మంతు కుమార్ తన పిల్లలతో కలిసి టిఫిన్ చేసేందుకు స్థానిక రాఘవేంద్ర హోటల్‌కు వెళ్లి దోసెలకు ఆర్డర్ ఇచ్చాడు. దోసెలు తింటుండగా బొద్దింక కనిపించడంతో అక్కడే పడేసి మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. వారువచ్చి రాఘవేంద్ర హోటల్ యాజమాన్యానికి రూ.2,500 జరిమానా విధించారు. ఈ విషయాన్ని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారి ప్రణవ్ తెలిపారు.

తొమ్మిది క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

మాడ్గుల: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. సీఐ వేణుగోపాలరావు తెలిపిన ప్రకారం.. మండల కేంద్రంలో ఓ ఆటోలో పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు వాహన తనఖీల్లో ఓ ఆటోలో తొమ్మిది క్వింటాళ్ల బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించి బియ్యం, వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాదచారికి బాటేది?

- సాగర్ రహదారిపై దూసుకుపోతున్న వాహనాలు
- వేగ నియంత్రణ చర్యలు శూన్యం
- రోడ్డు దాటేందుకు బాటసారుల ఇబ్బంది
- తరచూ ప్రమాదాలతో భయాందోళన
- కూడళ్లలో ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు నిర్మించాలని డిమాండ్



రద్దీగా ఉన్న తుర్కయంజాల్ చౌరస్తా

తుర్కయంజాల్: సాగర్ రహదారిపై పెరుగుతున్న వాహనాల రద్దీతో రోడ్డు దాటడానికి ప్రజలు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇంజాపూర్ మొదలు బొంగుళూరు ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఇదే దుస్థితి. దారి దాటే క్రమంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

వంతెన నిర్మిస్తేనే..

నిత్యం రద్దీగా ఉండే తుర్కయంజాల్ కూడలిలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మిస్తే కాని.. బాటసారులకు ఇబ్బంది తప్పేలా లేదు. రాగన్నగూడ, కమ్మగూడ, తుర్కయంజాల్‌లోని కాలనీలకు వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి కావడం, నగరంతో పాటు, ఇతర గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే వారు ఇక్కడి నుంచే ప్రయాణం చేయాల్సి ఉంటుంది. నిత్యవసరాల దుకాణాలు ఇక్కడే ఉండటంతో.. వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఈ నేపథ్యంలో బాటసారులు రోడ్డు దాటడం కష్టంగా మారింది. దీంతో ఇక్కడ వంతెన నిర్మించాలన్న డిమాండ్ రోజురోజుకూ పెరిగిపోతోంది.

మన్నెగూడ కూడలిలో..

సాగర్ రహదారిపై ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకునే కూడళ్లలో మన్నెగూడ ఒకటి. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. గాయాల బారిన పడటంతో పాటు పలువురు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. స్థానికులతో పాటు.. ఇబ్రహీంపట్నం ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయానికి రాకపోకలు సాగించే వారితో ఇక్కడ ట్రాఫిక్ అధికంగా ఉంటుంది. ఇక్కడ కూడా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని పలువురి అభిప్రాయం.

బారికేడ్లు కరువు

సాగర్ రహదారిపై వాహనాలు మితిమీరిన వేగంతో దూసుకుపోతున్న నేపథ్యంలో.. ప్రమాదాలు అదే స్థాయిలో జరుగుతున్నాయి. కానీ పోలీసులు మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. యూటర్న్‌లను ఏర్పాటు చేసి చేతులు దులుపుకొంటున్నారని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కనీసం బారికేడ్లను కూడా ఏర్పాటు చేయడం లేదని పేర్కొంటున్నారు. దీనికి తోడు రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలగకపోవడం కూడా ప్రమాదాలకు కారణంగా చెప్పుకోవచ్చు. మొక్కు బడిగా కేవలం తుర్కయంజాల్ కూడలిలో ఒకరిద్దరు ట్రాఫిక్ పోలీసులు ఉంటున్నప్పటికీ.. ట్రాఫిక్ నియంత్రణ చర్యలు శూన్యం. రాంగ్ రూట్‌లో వచ్చే వాహనాలతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, వాహనాల వేగ నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు, కూడళ్లలో కాలి నడక వంతెనలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

వేగ నియంత్రణకు చర్యలు



వాహనాల వేగ నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. తుర్కయంజాల్, రాగన్నగూడ కూడళ్లలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి హెచ్‌ఎండీఏకు ప్రతిపాదనలు పంపిస్తాం. కట్ట మైసమ్మ దేవాలయం, ఎస్‌ఎస్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌తో పాటు పలు రద్దీ చౌరస్తాల్లో బారికేడ్లను ఏర్పాటు చేస్తాం.

– గురు నాయుడు, ట్రాఫిక్ సీఐ, ఇబ్రహీంపట్నం

నవమి ఉత్సవాలు షురూ



కడ్తాల్: మైసిగండిలో కలశపూజ నిర్వహిస్తున్న పండితులు, భక్తులు



కడ్తాల్: మైసిగండిలో కొలువైన దేవతామూర్తులు



ఇబ్రహీంపట్నం: ఈశ్వరాంజనేయ దేవాలయం

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- నేడు రాములోరి కల్యాణం

ఇబ్రహీంపట్నం/కడ్తాల్: శ్రీరామనవమి వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కడ్తాల్ మండలం మైసిగండి రామాలయంలో కొలువైన శ్రీ కోదండరామచంద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, అఖండజ్యోతి స్థాపన, ధ్వజారోహణం, హోమశాల ప్రవేశం, అర్చన కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ స్నేహలత, ట్రస్టీ శిరోలి, తహసీల్దార్ జ్యోతి, అరుణ్‌కుమార్, నిర్వాహకులు భాస్కర్‌నాయక్, ఆలయ అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం

శ్రీ రామనవమిని పురస్కరించుకుని ఆదివారం సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణం తదితర ప్రాంతాల్లో చలువపందిళ్లు వేశారు. తాగునీటి, భోజన సౌకర్యాన్ని ఏర్పాట్లు చేశారు. రాములోరి కల్యాణం సందర్భంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ నుంచి తలంబ్రాలు, పట్టువస్త్రాలను ప్రభుత్వం సమర్పించనుంది. ఏర్పాట్లను ఆలయ ట్రస్టీ శిరోలి పర్యవేక్షించారు.

ఇబ్రహీంపట్నంలో..

శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆదివారం సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శ్రీ ఈశ్వరాంజనేయ దేవాలయం ముస్తాబైంది. ఆలయంలో సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామి మూర్తులతో ప్రత్యేక మందిరం ఉంది. ఆలయం ఎదుట ఉన్న కల్యాణ మండపంలో స్వామివారి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వాహకులు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు.

కళాకారులకు డప్పులు అందజేత

మంచాల: మండల పరిధి జాపాల, అస్మత్‌పూర్ గ్రామాల్లో వీఆర్‌వన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం కళాకారులకు డప్పులు అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ.. ఫౌండేషన్ ద్వారా గ్రామాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా అస్మత్‌పూర్, జాపాలలో 50 డప్పులు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు ఆవుల మల్లేశ్, హరిప్రసాద్, శేఖర్‌రెడ్డి, మాదిగ జేఏసీ నియోజకవర్గ అధ్యక్షుడు భాస్కర్, నాయకులు జంగయ్య, సుధాకర్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.



డప్పులు అందజేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర రెడ్డి తదితరులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- వారి సేవకే ప్రజాపాలన
- దశలవారీగా పథకాల అమలు
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- సన్నబియ్యం పంపిణీ పరిశీలన

ఇబ్రహీంపట్నం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం. వారికి సేవ చేసేందుకే ప్రజాపాలనను అధికారంగా కొనసాగిస్తున్నామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం బోయవాడలో రేషన్ దుకాణం వద్ద సన్న బియ్యం పంపిణీని శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు చేయని బియ్యం పథకాన్ని.. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ సర్కార్ ప్రవేశపెట్టిందని తెలిపారు. అర్హులైన పేద ప్రజలు సన్న బువ్వ తినాలన్న సంకల్పంతో దీనికి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు.

వచ్చే నెలలో ఇందిరమ్మ ఇళ్లు

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారం చేపట్టిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేయాలని భావించినా.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.7 లక్షల కోట్ల అప్పును రాష్ట్రం నెత్తిన మోపిందని ఎమ్మెల్యే ఆరోపించారు. వారు చేసిన అప్పులకు అసలు, వడ్డీ చెల్లిస్తూ హామీ మేరకు క్రమంగా పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఉచిత బస్సు ప్రయాణంతో పాటు వివిధ పథకాలను అర్హులకు అందజేస్తున్నామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకం కింద సబ్సిడీపై అర్హతను బట్టి ఒక్కొక్కరికి రూ.లక్ష నుంచి నాలుగు లక్షల వరకు రూ.8 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. వచ్చే నెలలో ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు, పింఛన్లు ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ అనంతరెడ్డి, డీఎస్‌ఓ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్లు కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి, చిలుక మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ సునీతారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు శేఖర్‌గౌడ్, మీడియా సెల్ నియోజకవర్గ కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీ ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్: పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శనివారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని రేషన్ దుకాణంలో సన్న బియ్యం పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఏక్కడా లేని విధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం అందజేస్తుందని తెలిపారు. బియ్యం పంపిణీతో లబ్ధిదారులు హర్ష వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, డీఎస్‌ఓ శ్రీనివాస్ రావు, తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రేఖ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బింగిదాస్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ కావ్య, మండల పరిషత్ మాజీ కోఆప్షన్ ఎండీ గౌస్ పాషా, కాంగ్రెస్ నాయకులు ఈసీ శేఖర్ గౌడ్, బుర్ర చంద్రంగౌడ్, ఊషయ్యగౌడ్, ప్రభాకర్ గౌడ్, శ్రీనివాస్‌గుప్తా పాల్గొన్నారు.

కల్యాణానికి ఆహ్వానం

మంచాల: మండల పరిధి రంగాపూర్ గుడిబండ రామాలయంలో నేడు జరగనున్న సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు బైరికా రమాకాంత్‌రెడ్డి, కోటి రాథోడ్‌లు పలువురు నాయకులతో కలిసి ఆహ్వానించారు. శనివారం నగరంలో ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రెడ్డి, మాధవ రెడ్డి, శ్రీనివాస్, గుడ్ల బాబు, జంగయ్య, కృష్ణారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, నాగరాజు, మధు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: రేషన్‌షాపులో బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

మంత్రివర్గంలో మల్‌రెడ్డికి చోటు కల్పించాలి

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రస్తుత మంత్రివర్గ విస్తరణలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి చోటు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ పెద్ద అంబర్‌పేట పురపాలక సంఘం సీనియర్ నాయకుడు, హైదరాబాద్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దండెం రాజశేఖర్ రెడ్డి కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. పార్టీకి కష్ట కాలంలో సేవలు అందించిన ఎమ్మెల్యేను అధిష్టానం గుర్తించి, ఆయనకు మంత్రి పదవి ఇవ్వాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కంచర్ల సత్యనారాయణరెడ్డి, లిక్కడి కృష్ణారెడ్డి, దొడ్లపాటి అయ్యప్పరెడ్డి, పసుల రమేష్‌బాబు, సిద్దెంకి భూపాల్ రెడ్డి, బండా వెంకట్‌రెడ్డి, అబ్దుల్లాపాషా, మర్యాల రాజు, పడమటి యాదిరెడ్డిలు పాల్గొన్నారు.



ఆమనగల్లు: పట్టణంలోని కూడలిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కడ్తాల్: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

‘అట్టడుగు వర్గాల అభ్యున్నతికి నిరంతరం పోరాడిన మహనీయుడు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్. ఉప ప్రధానిగా, కేంద్ర మంత్రిగా, పార్లమెంటు సభ్యుడిగా దేశానికి ఆయన చేసిన సేవలు ఆదర్శనీయం. చిరస్మరణీయం. జగ్జీవన్‌రామ్ ఆశయాలు నెరవేరాలంటే ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలి’ అని వివిధ సంఘాలు, పార్టీల నాయకులు అన్నారు. జగ్జీవన్ జయంతిని పురస్కరించుకుని శనివారం ఆమనగల్లు, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల్లో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు సకల జనులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాక్షి, నెట్‌వర్క్



యాచారంలో.. ఎమ్మార్పీఎస్ శ్రేణులు



మాడ్గులలో.. కాంగ్రెస్ నాయకులు



తుర్కయంజాల్: ఇంజాపూర్‌లో..



తుర్కయంజాల్‌లో..



తలకొండపల్లి: మండల కేంద్రంలో.. కాంగ్రెస్ శ్రేణులు



మంచాలలో.. బీజేపీ నేతలు



ఇబ్రహీంపట్నం: దండుమైలారంలో.. బీజేపీ శ్రేణులు



ఇబ్రహీంపట్నంలో.. మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



ఇబ్రహీంపట్నంలో.. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

ఉచిత వైద్య శిబిరం

షాబాద్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మంగలి చెన్నయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని కేసారం గ్రామంలో చేవెళ్ల పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రి వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన 315 మందికి పైగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందించడం అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి అవకాశాలను గ్రామీణ ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గ ఏబ్లాక్ వైస్ ప్రెసిడెంట్ పల్లాటి అశ్వని, మహిళా అధ్యక్షురాలు స్వరూప, జిల్లా సీనియర్ నాయకులు తోంట రాంచందర్ ఉన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



ఆలయంలో కొలువైన సీతారామచంద్రులు

ముస్తాబైన రాధాకృష్ణస్వామి ఆలయం

కడ్తాల్: రాధాకృష్ణస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మండల పరిధి బాలాజీనగర్ తండా గ్రామ పంచాయతీ సమీపంలోని ధనరాశి గుట్టపై వెలసిన స్వామివారి సన్నిధిలో నేటి నుంచి ఈ నెల 9వ తేదీ వరకు ఆలయ వార్షిక ఉత్సవాలను నిర్వహించనున్నారు.

ప్రకృతి ఒడిలో..

కొండల మధ్య ఎత్తైన ధనరాశి గుట్టపై వెలసిన రాధాకృష్ణస్వామి ఆలయ వార్షిక ఉత్సవాలను ఏటా నిర్వహిస్తారు. ప్రకృతి ఒడిలో.. చూడచక్కగా తెల్లటి చలువరాతితో నిర్మించిన ఆలయాన్ని దర్శించుకున్న భక్తులు మంత్రముగ్ధులవుతారు. ఇక్కడ స్వయంభూ వేంకటేశ్వర స్వామి, రాధకృష్ణస్వామి, శ్రీ సీతారామచంద్ర లక్ష్మణ, హనుమాన్ కొలువై ఉన్నారు. ఓ భక్తుడి కల సాకార ముక్తి క్షేత్రంగా, కలిదోష సర్వపాప, సర్వరోగ నివారణకై వెలసిన బ్రహ్మాండమైన దివ్యక్షేత్రంగా ఆలయం దేదీప్యమానంగా వెలుగొందుతోంది. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని పచ్చని మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఉత్సవ వివరాలు

6న సీతారాముల కల్యాణం. 7న విశ్వక్సేన ఆరాధన, ఋత్విక్వరణం, పుణ్యాహవాచనం, అంకురార్పణ, అంకురారోహణ, దేవత ఆహ్వానం, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహనం, బలిహరణం, హవనం. 8న ఆరాధన, చతుష్టానార్చన, నిత్యహవనం, శ్రీ రాధాకల్యాణ మహోత్సవం. 9న ఆరాధన, చక్రతీర్థం, మహా పూర్ణాహుతి, పుష్పయాగం, ద్వాదశారాధన, దేవతా ఉద్వాసన, మహాదాశీర్వాదంతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఇదిలా ఉండగా.. ఉత్సవాలకు నగరం నుంచి వచ్చే భక్తులు శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారిపై 50 కిలో మీటర్ల దూరంలో వాస్‌దేవ్‌పూర్ గేట్ ఉంటుంది. ప్రధాన రహదారి నుంచి 3 కిలో మీటర్ల దూరంలో బాలాజీనగర్ మీదుగా రాధాకృష్ణ స్వామి ఆలయానికి చేరుకోవచ్చు. ప్రతి ఐదు నిమిషాలకు నగరం నుంచి బస్సు సౌకర్యం కలదు.